
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 అక్టోబరు 2025 | 5 | చిత్తూరు



ఐదు ఏనుగుల సంచారం

భయాందోళనలో అటవీ ప్రాంత ప్రజలు



ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఆవుల పల్లె పంచాయతీ కొత్తూరు అటవీ ప్రాంతంలో ఐదు ఏనుగుల గుంపు సంచరిస్తోందని ఈ ప్రాంత ప్రజలు తెలిపారు. రెండు పిల్ల ఏనుగులు, మూడు పెద్ద ఏనుగులు గుంపుగా తిరుగుతూ రాత్రి వేళల్లో అటవీ ప్రాంతం వదిలి పొలాలపై పడి ధ్వంసం చేస్తున్నాయని ఏనుగుల ఘీంకా రాలు కూడా రాత్రి వేళల్లో వినిపి స్తున్నాయని ఏ నిమిషానికి ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. అటవీ అధికారులు పరిస్థితిని గుర్తించి ఏనుగులను ఈ ప్రాంతం నుండి దూరంగా తరిమివేయాలని ప్రజలు కోరు తున్నారు.



సంఘీభావ సమావేశంలో హోంమంత్రి

దళిత పదవులన్నీ అంబేద్కర్ భిక్షే..!

ప్రజాశక్తి - వెదురుకుప్పం 'దేవళంపేట ఘటన డ్రామాలా జరిగింది.. వైసిపి వాళ్లు ఎంత కుట్ర చేశారు.. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, కరుణాకర్‌రెడ్డిలు నిజాలు తెలుసుకుని రోడ్డుపైకి రావాలి.. అంబేద్కర్ విగ్రహాన్ని పునర్నిర్మించడంలో ఎంఎల్‌ఎల కృషి అభినందనీయం. రెండు గంటల్లోనే చిత్తూరు ఎస్పీ కేసును ఛేదించారు' అని రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత అన్నారు. తాను ఈ రోజు రాష్ట్రానికి హోంశాఖ మంత్రి అయ్యానంటే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పెట్టిన భిక్షేనని అన్నారు. తనతో పాటు దళిత ఎంఎల్‌ఎలకు పదవులు రావడానికి అంబేద్కర్ రాజ్యాంగంలో రాసిన రాతలేనని అన్నారు. అటువంటి మహనుభావుని విగ్రహాన్ని ఓ దళిత సర్పంచి గోవిందయ్య చేత నిప్పు పెట్టించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో సంఘీభావ సమావేశాన్ని శనివారం తెలుగు తమ్ముళ్లు ఏర్పాటు చేశారు. స్థానిక ఎంఎల్‌ఎ వివి థామస్ ఆధ్వర్యంలో జరిగింది. అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన చోటే, తిరిగి వేరే విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించిన విషయం విదితమే. రాష్ట్ర హోంమంత్రి ఎంఎల్‌ఎతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ పదాన్ని ఉపయోగించి వైసిపి వాళ్లు రాజకీయం చేశారన్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో, నిందితులను పట్టుకోవడంలో జిల్లాఎస్పీ కృషి అభినందనీయమన్నారు. కొత్తగా చిత్తూరు జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయినా, రెండు గంటల్లోనే కేసును ఛేదించడం గొప్ప విషయమన్నారు. వైసిపి నాయకులంతా కలిసి టిడిపి నాయకుడు సతీష్‌రెడ్డిని అరెస్టు చేయాలని ధర్నా చేశారని, ఆ రోజంతా ఓ డ్రామాలా సాగిందన్నారు. వైసిపికి చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి రోడ్డుపైకి వచ్చి దుండగులను పట్టుకోవాలని నిరసనలు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. నారాయణ స్వామికి వయస్సు పెరిగింది కానీ బుద్ధి పెరగలేదన్నారు. గంగాధరనెల్లూరు ఎంఎల్‌ఎ డాక్టర్ వివి థామస్ మాట్లాడుతూ లిక్కర్ మాజీ మంత్రి నారాయణస్వామి చేసిన డ్రామా అన్నారు. ఒక విగ్రహానికి నిప్పు పెడితే వెయ్యి విగ్రహాలు నిలబెడతామన్నారు. తన అనుచరుడు స్థానిక సర్పంచి గోవిందయ్య చేత నిప్పు పెట్టించారన్నారు. నారాయణస్వామి హయాంలో దళితులను గంజాయి, సారా మత్తులో ముంచి, వ్యవస్థను నాశనం చేశారన్నారు. ఆయన రాజకీయ స్వార్థం కోసం గతంలో ఆయన సొంత ఊరిలో చనిపోయిన గుర్తు చేశారు. టిటిడి బోర్డు సభ్యులు, అనంతపురం ఎంఎల్‌ఎ ఎంఎస్ రాజు మాట్లాడుతూ నారాయణస్వామి డ్రామాలో గోవిందయ్య బలిపశువు అయ్యాడన్నారు. పూతలపట్టు ఎంఎల్‌ఎ మురళి మాట్లాడుతూ దేశానికి ఒక వ్యవస్థను సృష్టించి, అందులో మనం ఏవిధంగా జీవనం సాగించాలి, మన హక్కుల గురించి దిశానిర్దేశం చేసిన వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, సత్యవేడు ఎంఎల్‌ఎ ఆదిమూలం, వేపంజేరి మాజీ ఎంఎల్‌ఎ ఆర్ గాంధీ, ఎంఆర్‌ఓ బాబు, ఎంపిడిఒ, పురుషోత్తం, వెలుగు అధికారి పరశురాం రెడ్డి, కార్వేటినగరం మండల పార్టీ అధ్యక్షులు వెంగళ్రాయ్ యాదవ్, వెదురుకుప్పం మండల అధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్ మురళి, వెంగళరాయలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్లూ రంగు పసుపయ్యింది.. అంతేనా..!

సిబిఐ విచారణ జరపాలి : నారాయణస్వామి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహం అగ్ని ప్రమాద వివాద ఘటనపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నేపథ్యంలో నిజాలు నిగ్గుతేల్చడానికి సిబిఐ ఎంక్వైరీ వేయాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవళంపేట ఘటనపై స్పందించిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్రంలోని పిఠాపురం, నెల్లూరు వివిధ ప్రాంతాలలో ఎస్సీలపై జరిగిన దాడిలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు ఒక తల్లి బిడ్డలు ఉన్న మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టారని, ఒక ఎస్సీ సామాజిక వర్గంపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతుంటే అదే సామాజిక వర్గానికి చెందిన హోంమంత్రి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ నోటికొచ్చినట్టు మాట్లాడడం సబబు కాదన్నారు.

కుప్పంలో రూ.219 కోట్లతో శ్రీజ పరిశ్రమ

వర్చువల్‌గా ప్రధాని మోడీ శంకుస్థాపన



ప్రజాశక్తి-కుప్పం

కుప్పం నియోజకవర్గ పరిధిలోని గుడిపల్లి మండలం పొగురుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో శ్రీజ మహిళా పాల ఉత్పత్తి సంస్థ యొక్క ఇంటిగ్రేటెడ్ డెయిరీ పశువుల దాణా ప్లాంట్ ఏర్పాటుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో శనివారం శంకుస్థాపన చేశారు. సుమారు 45 ఎకరాల స్థలంలో రూ. 219 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పరిశ్రమకు ప్రధాని శంకుస్థాపన చేయగా కుప్పం కడ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, మహిళలు, టిడిపి నేతలు, అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. దేశంలో పాల ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రధాని నరేంద్ర మోడీ శనివారం పలు రాష్ట్రాలలో కొత్త డెయిరీ ప్రాజెక్టుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా పొగరుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో శ్రీజ పరిశ్రమ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శ్రీజ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి ఎం ఓ యు కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కడ పిడి వికాస్ మరమ్మత్, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్, జనసేన నేత నరేష్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు సుగుణమ్మ పాల్గొన్నారు.

ఓఆర్ఐని పరిశీలించిన ఎస్వీయూ వీసీ



ప్రజాశక్తి - ఎస్వియూ క్యాంపస్

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు బాధ్యతలు చేపట్టిన వెంటనే సాయంత్రం విశ్వవిద్యాలయంలోని ప్రతిష్ఠాత్మక మైన ప్రాచీన తాళపత్ర గ్రంథాలయాన్ని (ఓఆర్ఐ) సందర్శించారు. తాను వెబ్సైటులో చూసిన తాళపత్ర గ్రంథాలను నేరుగా చూసి ఆశ్చర్య పోయారు. సంస్థ సంచాలకులు ఆచార్య పి సి వెంకటేశ్వర్లును అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరిరక్షణకు తీసుకుంటున్న శాస్త్రీయ విధానాలను చూసి అభినందించారు. ఇంత పెద్ద స్థాయిలో ప్రాచీన సాహిత్యం భద్రంగా యస్వీయూ సంరక్షించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, చంద్రశేఖర్, వెంకటేష్, సిద్దయ్య, బాషా, నాగరాజు,శోభన్ బాబు,విశ్వనాథ్ రెడ్డి, పరిశోధకులు సంతోష్, సోమలింగడు, శోభన్ తదితరులు పాల్గొన్నారు.



గార్గేయ నది ఉధృతం

- కొట్టుకుపోయిన తాత్కాలిక మట్టి కల్వర్టు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- శాశ్వత వంతెన నిర్మాణం చేయాలని డిమాండ్

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలోని పెద్ద ఉప్పరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో బసవ పల్లి, పేటూరు మార్గంలో గార్గేయ నదిపై తాత్కాలిక మట్టి కల్వర్టు నది నీటి ఉధృతికి శనివారం పూర్తిగా కొట్టుకు పోయింది. అటవీ ప్రాంతంలో నదికి ఎగువ ప్రాంతంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ఉధృతి పెరిగి మట్టి రోడ్డు కొట్టుకు పోయి పైపులు మాత్రం మిగిలాయి. ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. వర్షాలు కురిసిన ప్రతిసారి మట్టితో నిర్మించిన రహదారి కొట్టుకుపోవడం, తిరిగి నిర్మించడం, మళ్లీ కొట్టుకుపోవడం.. ఇలా నాలుగు సార్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పాఠశాలకు సోమల లోని కళాశాలకు విద్యార్థులు రావాలన్నా, ప్రజలు నిత్యావసర వస్తువులు కొనుక్కునేందుకు పెద్ద ఉప్పరపల్లికి రావాలన్న మట్టి వంతెన కొట్టుకు పోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ ప్రాంత ప్రజలు తమకు ఇబ్బందులు తొలగించేందుకు శాశ్వత వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం నాయకులు, అధికారులు ప్రజల ఇబ్బందులను గుర్తించి వంతెన నిర్మించి తమ బాధలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

తవణంపల్లిలో భారీ వర్షం

తవణంపల్లి: మండలం మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మాధవరం, సరకల్లు, గాజులపల్లి పరిసర ప్రాంతాల్లో నీటి మట్టం పెరగడంతో రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. ఈ కారణంగా వాహన రాకపోకలు స్తంభించాయి. గాజులపల్లి డ్యాం, తొడతర డ్యాం, అరగొండ డ్యాం ప్రాంతాల్లో తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వేలు భారీ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ మార్గాల ద్వారా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర కారణాలు లేకుండా ఆ ప్రాంతాల వైపు ప్రయాణించవద్దని, వేరే ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని తవణంపల్లి తహశీల్దారు సుధాకర్ ప్రజలకు సూచించారు. అధికార యంత్రాంగం పరిస్థితిని సమీక్షిస్తూ పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తోంది.

చెరువులకు జలకళ

బంగారుపాళ్యం: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గౌని చెరువు, గుంతూరు చెరువు ,వెంకటప్పనాయి చెరువు, చిల్లా మల చెరువులు జలకళ సంత రించుకున్నాయి. నీరు కాలువల మరవలు పోతు న్నాయి. ఈ వర్షా నికి రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రెండు సంవత్స రాల వరకు నీరు ఉపయోగ పడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాలు వరకు సాగుకు నీరు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. చెరువుల జలకళను ఆసక్తితో తిలకిస్తున్నారు. మరి కొందరు అందులో చేపలను వేటాడేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మామిడి టన్నుకు..

రూ.12 వేలు చెల్లించే వరకు పోరాటం

మామిడి రైతుల సంక్షేమ సంఘం హెచ్చరిక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : మామిడి రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరగా నిర్ణయించిన టన్నుకు రూ.12 వేలు చొప్పున ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.500 కోట్లు సత్వరం చెల్లించాలని లేకుంటే పోరాటం ఆగదని మామిడి రైతు సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. శనివారం ఎస్‌టియు కార్యాలయంలో మామిడి రైతు సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షులు డాక్టరు టి జనార్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె సురేంద్రన్‌లు మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 50 వేల మంది రైతులు తోతాపురి బిల్లుల కోసం పడరాని పాట్లు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బిల్లులు చెల్లించడంలో ఆలస్యానికి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగమే ప్రత్యక్ష బాధ్యత వహించాలని పేర్కొన్నారు. నాలుగు రూపాయలు సబ్సిడీ చెల్లిస్తామంటూ రెండు నెలలుగా ఊరించిందని, మొత్తం రూ.12 చొప్పున చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పలు ర్యాంపుల నిర్వాహకులు 2,3 మాత్రమే బిల్లులు చెల్లించారంటే ప్రభుత్వం అంటే వారికి లెక్కలేని తనమా? లేక వాళ్లపై నియంత్రణ లేకపోవడమా? అని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మామిడి రైతులకు బిల్లులు చెల్లించడంలో ఫ్యాక్టరీలు, ర్యాంపులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో వీటిపై సమగ్రంగా చర్చించి తగు నివేదిక సమర్పించేందుకే ఈనెల 15న బంగారుపాళ్యంలో ఆక్రందన సభ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆక్రందన సభను ప్రభుత్వం అడ్డుకోవడమంటే పరోక్షంగా గుజ్జు యజమానులకు కొమ్ముకాస్తూ రైతు వ్యతిరేక ప్రభుత్వంగా భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి బి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు, పి హేమలత, బి మురళి, త్యాగరాజు రెడ్డి, , సందీప్, కోశాధికారి సంజీవ్ రెడ్డి, మోహన్ రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.



మామిడి రైతుల ఆక్రందన సభ కరపత్రాలను విడుదల చేస్తున్న మామిడి రైతుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం

సదుంలో 'ఎంత చిత్రం కథ' చిత్ర నిర్మాణం



ప్రజాశక్తి-పుంగనూరు: సదుం మండలంలోని ఊటుపల్లిలో 'ఎంత చిత్రం కథ' చిత్ర నిర్మాణం కొనసాగుతోంది. గత మూడు రోజులుగా మండలంలో ఊటుపల్లి సమీపంలోని మల్లేశ్వర స్వామి ఆలయం పరిసరాల్లో చిత్ర నిర్మాణం జరుగుతోంది. ఎంఎన్ నాని అందించిన కథ ఆధారంగా ఎమ్ఎమ్ స్టూడియోస్, ఎస్పీడీ నిర్మాణంలో కిరణ్, సూర్య, జగదీశ్ నిర్మాతలుగా, రాకేష్ దర్శకత్వం సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం మొదటి షెడ్యూల్ నిర్మాణం కడప పరిసరాల్లో విజయవంతంగా పూర్తి చేసుకుంది. రెండో షెడ్యూల్లోని కొన్ని కీలక సన్నివేశాలతో పాటు మరికొంత టాకీ పార్ట్ ను పీలేరు పరిసరాల్లో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయకులుగా జగదీష్, సూర్య, కథానాయకిగా మౌనిక, ప్రతి నాయకుడి పాత్రలో హరీష్ నటిస్తున్నారు. అలాగే పీలేరు కు చెందిన 'ఆల్ ది బెస్ట్' ఖాదర్, తరిగొండ రాధాకృష్ణ, విజయ్ కుమార్, బాబ్జాన్, తదితరులు కూడా నటిస్తున్నారు. "ఎంత చిత్రం కథ" సినిమాకు కెమెరామెన్ గా సంజయ్ జూమ్ ఇన్ నాని, స్టంట్ మాస్టర్లుగా తుఫాన్, సురేష్, సుహేల్ వ్యవహరిస్తున్నారు. నగేష్ సంగీతం సమకూరుస్తున్నారు.

కాంగ్రెస్ సంతకాలు సేకరణ

ప్రజాశక్తి -పుంగనూరు: బీజేపీ ప్రభుత్వంపై, ఓట్ చోరీపై పోరాటం, బిజెపి చేస్తున్న మోసాలు గ్రామ గ్రామానికి చేరాలనే ఉద్దేశంతో ఓట్ చోరీపై పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం సంతకాల సేకరణ ప్రారంభించామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎస్ అయూబ్ బాషా తెలిపారు. పుంగనూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మురళి మోహన్ యాదవ్ సూచనలతో శనివారం ఓట్ చోర్- గద్దె చోడ్ పై నిరసన తెలిపి సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి అధికారం అడ్డం పెట్టుకొని కేంద్ర ఎన్నికల అధికారులతో కుమ్మక్కై, కాంగ్రెస్ బలంగా ఉన్న చోట బడుగు, బలహీన వర్గాల ఓట్లను తొలగించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కి అండగా ఉంటారని భావించిన బిజెపి వారి ఓట్లను తొలగించి అధికార గద్దెనెక్కిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ముబారక్ పాషా, షేక్ ఫయాజ్, రాయల్ అల్తాఫ్, మహ్మద్, సుహేల్, మండల అధ్యక్షులు మురళి యాదవ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓట్ చోరీపై సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సూపర్ జిఎస్‌టి ఎవరికి ప్రయోజనం?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: గూడ్స్ సర్వీస్ టాక్స్ (జీఎస్టీ) మోడీ ప్రధానిగా గద్దెనెక్కాక అప్పటి వరకు ఉన్న టాక్స్‌ల విధానాన్ని రద్దు చేస్తూ ప్రజల ప్రయోజనాల కోసమే అంటూ 'ఒకే దేశం - ఒకే పన్ను.. ఒకే పన్నుల విధానం' అంటూ జీఎస్టీని అమలులోకి తీసుకు వచ్చారు.

నాడు ఒకే పన్నుల విధానంతో ప్రజలపై పన్నుల భారం తగ్గడంతో పాటు దేశ అభివృద్ధి చెందుతుందని తెలిపిన ప్రధాని మోడీ నేడు ఉన్న ఫళంగా జీఎస్‌టి 2.0 పేరిట అన్ని రకాల వస్తువులపై పన్నుల శాతాన్ని 5-18 కిందికి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా పన్నులు తగ్గాయంటూ బిజెపి ప్రభుత్వం ప్రచారం చేస్తుంటే... రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు ద్వారా జరిగే ప్రయోజ నాలపై సభలు, సమావేశాలు విద్యా సంస్థల్లో వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తోంది. నిత్యావసర వస్తువులపై నామ మాత్రపు తగ్గింపులే తప్ప సామాన్యులకు ఒరిగేదేమీ లేదని పేదలు జిఎస్టి తగ్గింపు పై నిట్టూరుస్తున్నారు.

నిత్యావసర ధరలు అదుపు చేయడంలో విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ ద్వారా రాష్ట్ర ఆదాయానికి వచ్చే 8 వేల కోట్ల రూపాయలు తగ్గుతున్న ప్రజా ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటిస్తోంది. జిల్లా కేంద్రమైన చిత్తూరులో రెండు రోజుల పాటు జీఎస్టీ 2.0 ఎగ్జిబిషన్ మేళా జ్యోతిరావు పూలే భవన్‌లో నిర్వహి స్తున్నారు. నిజంగానే ధరలు తగ్గి ఉంటే పేద మధ్య తరగతి ఈ జీఎస్టీ మేళాకు భారీ సంఖ్యలో వచ్చి ఉండేవారు. కళాశాలల విద్యార్థులు, డ్వాక్రా మహిళలతోనే జీఎస్టీ ఎగ్జిబిషన్ మేళా సాగింది. ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, ద్విచక్ర వాహనాలు మినహా జిఎస్టి తగ్గింపుతో తగ్గనున్న నిత్యావసర వస్తువులేవి ఎగ్జిబిషన్లో కనిపించకుండా పోయాయి. జిఎస్టి 2.0 వల్ల పేద మధ్య తరగతి వర్గాలకు ఒరిగేదేమీ లేదని ప్రజలు నిట్టూరు స్తున్నారు.

మరమ్మతులు చేయించండి

ఎమ్మెల్యేకు కురప్పల్లి వంతెన బాధితుల వినతి

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు మండలం మొరం పంచాయతీ పరిధిలోని కురప్పల్లి సమీపాన వున్న వంతెన ప్రస్తుత వర్షాలకు దెబ్బతిని ప్రమాద కరంగా మారడంతో గ్రామానికి రాక పోకలకు ఇబ్బందిగా ఉంద ని వెంటనే మరమ్మతు లు చేయించా లని పలమ నేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి కురపల్లి గ్రామస్తు లు శనివారం వినతి పత్రం అందించారు. అధికారులకు చెప్పి వెంటనే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటముని రెడ్డి, చంద్రశేఖర్, విశ్వనాథరెడ్డి, పూర్ణచంద్ర, అమరనాథ, కవీంద్రనాయుడు, జగదీష్, జయప్ప, వెంకటరమణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కురప్పల్లి వంతెన బాధితులు

అపరిశుభ్రతకు కేరాఫ్ లక్కనపల్లి ఎస్‌సి కాలనీ

- డ్రైనేజీలు కరువు.. రోడ్లపైనే మురుగునీరు
- గ్రామంలో ఎక్కడ చూసినా పేడదిబ్బలు
- పూర్తిగా లోపించిన పారిశుద్ధ్యం
- భయాందోళనలో ఎస్‌సి కాలనీ వాసులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతీ కేంద్రంలోని ఎస్‌సీ కాలనీలో అపరిశుభ్రత తాండవిస్తోంది. అయినాఏ అధికారి కూడా తమ గ్రామం వైపు రావట్లేదని ఎస్‌సి కాలనీ దళితులు తెలిపారు.

రోడ్లపైనే మురుగునీరు

కాలనీలో నీళ్ల ట్యాంకును శుభ్రపరిచి చాలా రోజులైందని స్థానికులు పేర్కొంటు న్నారు. వెంటనే ట్యాంకును శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని వారు కోరుతున్నారు. డ్రైనేజీల సౌకర్యం పూర్తిగా కరువైందని తెలిపారు. ఎప్పుడో తవ్విన కాలువలు పూడిపోవడం వల్ల ఇళ్ల నుండి వస్తున్న మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది.

ఎక్కడ చూసినా పేడ దిబ్బలు

అక్కడక్కడా పేడ దిబ్బలు వేయడం వల్ల వల్ల అపరిశుభ్రతకు నిలయంగా మారిందని ఆ పరిసర ప్రాంతాల వాసులు తెలిపారు. ఎక్కడపడితే అక్కడ రోడ్లపైనే పాడి ఆవులను కడుతున్నారని కట్టకుండా చర్యలు తీసుకోవాలని, చెత్తను తీయడానికి కూడా పంచాయతీ వారు ఎవరూ రావట్లేదని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ ఎస్‌సి కాలనీ వాసుల సమస్యలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భయాందోళనలో ప్రజలు

కాలనీలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించడంతో దోమలు అధికమై విష జ్వరాలు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం వుందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపర చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



అపరిశుభ్రంగా వున్న ట్యాంకు



నీవానది వరద బాధితులకు భోజన ప్యాకెట్లు అందిస్తున్న టిడిపి నాయకులు

బాధితులకు భోజనం పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు పట్టణ టిడిపి నాయకులు నీవా నది ఒడ్డున వున్న వీరభద్ర కాలనీ వాసులకు శనివారం ఇంటింటికీ వెళ్లి ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చయ్యప్ప, ఉపాధ్యక్షులు వరలక్ష్మీ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ వెంకటేష్ యాదవ్, ఉపాధ్యక్షులు అనురాధ, మహిళా అధ్యక్షురాలు నళిని, కార్యదర్శి సబిత, క్లస్టర్ ఇన్‌ఛార్జి భువనేశ్వరి, నాయకులు ఉదయ్, గోపాల్, సాయి కుమార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌టిసి డిఎం అల్తాఫ్ బాషా

ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌టీసీ డిఎం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని పలమనేరు ఆర్‌టిసి డిపో మేనేజర్ అల్తాఫ్ బాషా శనివా రం మర్యాద పూర్వ కంగా కలిశారు. చిత్తూరు 2 డిపో నుంచి పలమనేరుకు బదిలీపై వచ్చిన ఆయన స్థానిక టిడిపి కార్యాలయంలో పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా డిపోకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వినియోగదారులు సహకరించాలి: ఏఈ



ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని జక్కదొన, నల్ల వెంకనపల్లి పంచాయతీలలో విద్యుత్ ఉండదని ఏఇ రియాజ్ అహ్మద్ శనివారం మీడియాకు తెలిపారు. మండలంలో త్రీఫేస్ విద్యుత్ లైన్ వర్క్ కొనసాగుతోంది. అందువల్ల ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కరెంటు ఆఫ్ చేసి లైన్ పనులు జరుగుతాయని తెలిపారు. ఈ కారణంగా వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిగ్నల్ సమస్యతో ఆగిన రైలు

బారులు తీరిన వాహనాలు

ప్రజాశక్తి- సోమల: తిరుపతి జిల్లా దామల్‌చెరువు రైల్వే గేటు వద్ద సిగ్నల్ సమస్యతో తిరుపతి అమరావతి రైలు ఆగిపోవడంతో తిరుపతి– దామలచెరువు రోడ్డు మార్గంలో వాహనాలు బారులు తీరాయి. 45 నిమిషాల పాటు రైలు గేటుకు అడ్డంగా నిలచిపోవడంతో బస్సు కారు ఇతర లగేజీ వాహనాల వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఐదు గంటల 27 నిమిషాలకు రైలు బయలుదేరడంతో రైల్వే గేట్ తెరుచుకోవడంతో వాహనాలు ముందుకు కదిలాయి.

స్వచ్ఛత అవార్డులపై హర్షం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మున్సిపాల్టీకి రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛత అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డితో పాటు సిబ్బందిని అభినందించి పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమరనాథ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజలు అధికారుల పరస్పర భాగస్వామ్యంతోనే ఈ అవార్డు దక్కిందని దీంతో మనందరిపై మరింత బాధ్యత పెరిగిందని భవిష్యత్తులో జాతీయ స్థాయిలో అవార్డును దక్కించుకునేలా అందరూ కలిసికట్టుగా పనిచేసి పారిశుధ్యంలో పలమనేరుకు మంచి పేరును తీసుకురావాలని కోరారు. మున్సిపల్ పరిధిలో సమస్యలు ఏదైనా ఉన్నా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి చెత్త సేకరణ విషయంలో సహకరించి తోడ్పాటు అందించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌కు, మున్సిపల్ సిబ్బందికి సన్మానం



మున్సిపల్ సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రోడ్డు

యానాది కాలనీకి సిసి రోడ్లు మంజూరు

కాలనీ వాసుల హర్షం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండలం కీలపట్ల గ్రామ పంచాయతీలోని యానాది కాలనీలో సిసి రోడ్డులు లేక పోవడంతో కాలనీ వాసులు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి తెలిపారు. వెంటనే కాలనీకి సిసి రోడ్లు మంజూరు చేసి పనులు పూర్తి చేయడంతో కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా తమ కాలనీకి సిసి రోడ్లు లేవని ప్రస్తుతం కాలనీ అంతా సీసీ రోడ్డు వేయడంతో తమకు సౌకర్యవంతంగా ఉందన్నారు.

కొనసాగుతున్న ఈకేవైసీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి:గ్రామీణ ఉపాధి హామీలో పనిచేస్తున్న వేతనదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు ప్రతి ఒక్కరికీ ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఎంపీడీవో బాలాజీ సూచించారు. శనివారం కోగిలేరు పంచాయతీలో పొట్టుగానిపల్లిలో జరుగుతున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఎంపీడీవో పరిశీలించారు .గ్రామాలకు దూరంగా పొలాల వద్ద నివాసం ఉంటున్న వేతన దారులను సైతం కలసి ఉపాధి హామీ సిబ్బంది ఈకేవైసీ నమోదు చేస్తున్నామని అన్నారు. జిల్లాలో ఈకేవైసీ నమోదు ప్రక్రియలో మండలంలో రెండవ స్థానంలో ఉందని, మండలంలో మొత్తం 10,142 మందికి ఈకేవైసీ నమోదు చేయాల్సి ఉండగా శనివారం సాయంత్రానికి 8,758 మందికి 86 శాతం ఈకేవైసీ నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో అందుబాటులో లేని వారిని కూడా సంప్రదించి వారికి కూడా ఈకేవైసీ నమోదు ప్రక్రియ వందశాతం పూర్తి చేయించాలని ఎంపీడీవో ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మురుగేషన్, టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ,రెడ్డి పల్లవి, విజయలక్ష్మి, జయచంద్ర ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.





పళ్ల రసాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎగ్జిబిషన్‌లో పండ్ల రసం పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జ్యోతిరావు పూలే భవనంలో చిత్తూరు జిఎస్‌టి అధికారుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సూపర్ జిఎస్‌టి–సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా పండ్ల పరిశ్రమ సమాఖ్య , ఆల్ ఇండియా ఫుడ్ ప్రాసెసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు పళ్ల రసాలపై అవగాహన కోసం ఉచితంగా మామిడి పళ్ల రసం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ , జీఎస్టీ అధికారులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. పండ్ల రసాల ప్రాధాన్యతను ప్రజల్లో విస్తరించడానికి, రసాయన రసాల నుంచి దూరంగా ఉండడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని పండ్ల పరిశ్రమ సమాఖ్య కార్యదర్శి కట్టమంచి బాబి తెలిపారు. వెయ్యి మందికి మామిడి పళ్ల రసం అందించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ మునిరాజు

ప్రజాశక్తి -శాంతిపురం: ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని కుప్పం మార్కెట్ కమిటీ చైర్మన్ మునిరాజు పేర్కొన్నారు. శనివారం శాంతిపురం మండలం వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన రైతులు, అధికారులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వున్న 386 మంది రైతులను నెల లోపు రెండింతలు పెంచాలని కోరుతూ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రకృతి సేద్యాన్ని ఎక్కువగా ప్రోత్సహించాలని, నాణ్యమైన అధిక దిగుబడులను ఉత్పత్తి చేసే పంటల వైపు రైతులకు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించే పంటలకు మార్కెట్లో ఉన్న ఆదరణను రైతులకు తెలపాలన్నారు. మార్కెటింగ్ సౌకర్యాల గురించి వారికి తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్లు హరినాథ్ రెడ్డి , చంద్రకళ , డిపిఎం అమృతవల్లి, ఎపిఎం శ్రీనివాసులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దాతలు సాయం చేయండి..

లివర్ సమస్యతో వున్న కుమారుడిని రక్షించాలని ఓ తల్లి అభ్యర్థన

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: దాతలు సాయం చేసి అదుకుని లివర్ సమస్యతో బాధపడుతున్న తమ కుమారుడిని ఆదుకోవాలని ఓ తల్లి అభ్యర్థించింది. గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ బాలయ్య కొత్తూరు గ్రామానికి చెందిన నీతూ, నరసింహారెడ్డిలకు వెంకటేష్ (10), కూతురు చంద్రిక (7)లు ఉన్నారని తెలిపారు. వెంకటేష్ తూగుండ్రం ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. వెంకటేష్‌కి సంవత్సరం క్రితం మొదట్లో జ్వరంతో బాధపడేవాడని, ఈ విషయమై చిత్తూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు చేయించగా జీర్ణ సమస్య వల్ల అలాంటి ఇబ్బందులు వస్తున్నాయని, కడుపు ఉబ్బరంగా ఉంటూ ఇబ్బంది పడుతుండేవాడని తెలిపారన్నారు. అనుమానం వచ్చి చీలాపల్లి సిఎంసి వైద్య పరీక్షలు చేయించగా వెంకటేష్‌కి లివర్ సమస్య ఉన్నట్లు అక్కడి డాక్టర్లు తెలిపారన్నారు. సుమారు సంవత్సరం కాలంగా వేలూరు సిఎంసిలో వివిధ పరీక్షలు నిమిత్తం మందులు, మాత్రలు కోసం ఇప్పటి వరకు తమ కొడుకు కోసం రూ.8 లక్షలు వరకు అప్పు చేసి ఖర్చుపెట్టామన్నారు. ఆ అబ్బాయి వెంకటేష్‌కు ఆపరేషన్ చేసి లివర్ మార్పిడి



అభ్యర్థిస్తున్న బాలుడి తల్లి నీతూ

చేయడానికి సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని వేలూరు సీఎంసీ ఆస్పత్రి వర్గాలు ధ్రువీక రించారని ఆ దంపతు లు పేర్కొన్నారు. అలా వీలుకాని పక్షంలో కొడుకు కోసం ఆ తల్లి తన లివర్‌ను కొంత తీసి ఆపరేషన్ ద్వారా కొడుకు అమర్చాలని తెలిపామని అందుకు తల్లి బిడ్డలకు ఆపరేషన్ చేసి కొంతకాలం పాటు ఆసుపత్రిలోనే వుండేందుకు భారీగా డబ్బు ఖర్చవుతుందని దాతలు సాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్‌ని కలిసి విన్నవించగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి సాయం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. దాతలు ఎవరైనా తమకు సహాయం చేస్తే అకౌంట్ నెంబర్ : (64 2310009951242 ఈ నంబర్‌కి గాని, ఐఎఫ్‌సి కోడ్ నెంబర్: యుబిఐనెం: ఓసిజి 7999కు, లేదంటే ఫోన్ పే నెంబర్ 9398226262 సాయం అందించి ఆదుకోవాలని కోరారు.



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కంటి ఆపరేషన్లకు 16 మంది ఎంపిక

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం లయన్స్ క్లబ్ అధ్వర్యంలో పిఈఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు వందమంది శిబిరానికి హాజరు కాగా వైద్యులు వారికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత ఆపరేషన్లకు పదహారు మందిని ఎంపిక చేశారు. లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్ మాట్లాడుతూ వృద్ధాప్యం, పౌష్టిక ఆహారలోప, అధిక సమయం మొబైల్ వాడటం వల్ల కంటి చూపు లోపించిన వారికి అదేవిధంగా డయాబెటిక్‌తో బాధపడుతున్న వారికి వైద్యం చేయించాలని పేర్కొన్నారు. శిబిరానికి హాజరైన వారికి లక్ష్మీనారాయణ హోటల్ వారు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సెల్వం, జయరాం నాయుడు, డాక్టరు కృష్ణమూర్తి, డాక్టరు వరదరాజులు పి ఈ ఎస్ ఆసుపత్రి పి ఆర్ ఓ లు వెంకటేష్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గిరి ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

వైభవంగా గిరి ప్రదక్షిణ

అన్నదానం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని నరివేపాని కొండ చుట్టూ సోమల పరిసర ప్రాంత భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో వెంకటేశ్వర స్వామి వారి పాదాల వద్ద పూజలు నిర్వహించి పాదయాత్రతో కొండ చుట్టూ భక్తి పాటలు పాడుతూ భజనలు చేస్తూ వృద్ధులు మహిళలు పిల్లలు ఉత్సాహంగా ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించి తదుపరి భక్తి పాటలు పాడి రాత్రి సోమల లోని యోగాభిరామ స్వామి వారి ఆలయంలో భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి -కార్వేటినగరం: విజయవాడ హైకోర్టు జడ్జి కృష్ణమోహన్ శనివారం రాత్రి కార్వేటినగరంలో వెలసిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ వేద పండితులు స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హైకోర్టు జడ్జికి స్వామి వారి తీర్ధ ప్రసాదాలను అందించారు. వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఈ క్రమంలో భాగంగా జడ్జిని టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ పట్టు వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. జడ్జి వెంట జిల్లా జడ్జి అరుణ్‌సాగరిక, జడ్జి శ్రీకాంత్(తిరుపతి), జడ్జీలు రాఘవేంద్ర, జానకి, రమ్యసాయి, న్యాయవాదులు గాలుగు సురేష్ బాబు, దినకర్, సీఐ హనుమంతప్ప పాల్గొన్నారు.

జీఎస్‌టీపై అవగాహన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిఎస్‌టి 20 ద్వారా ధరల తగ్గింపు పై వినియోగదారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సూచించారు. శనివారం చిత్తూరు పట్టణం జ్యోతిరావు పూలే బిసి భవన్‌లో కమర్షియల్ ట్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్ జిఎస్‌టి – సూపర్ సేవింగ్ ఎగ్జిబిషన్‌ను చిత్తూరు ఎంపీతో పాటూ నగర కమిషనర్ నరసింహప్రసాద్ ప్రారంభించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, టిడిపి నేత సునీల్ చౌదరి, జిఎస్‌టి జాయింట్ కమిషనర్ ఎ.రవీంద్ర నాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జిఎస్టి పి మహేష్ కుమార్, దీప్తి అసిస్టెంట్ కమిషనర్ బి శ్రీనివాసులు రెడ్డి, టీమ్ మెంబర్లు ఏ రాజగోపాల్ రెడ్డి, నాగరాజులు, నాగరాజులు, సునీల్ కుమార్, డీకే హరిప్రసాద్, ఎన్ రణవీర్, కే భార్గవ్, పి శోభన, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపు ప్రజలకు ఉపశమనం వ్యాపారానికి ఊపిరి నిస్తోందని నోడల్ అధికారి సురేష్ పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గించడం వల్ల నిరుపేద మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని జీఎస్టీ తగ్గింపు పై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు పట్టణ పరిధిలో పురపాలక సంఘం ఎదురుగా వివిధ సంస్థల ద్వారా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీఎస్‌టీపై అవగాహన కల్పించారు. కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ తగ్గిన జీఎస్‌టిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దపంజాణి: మండల కేంద్రంలో బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన జీఎస్టీ ఎగ్జిబిషన్ కేంద్రాన్ని ఎంపిడివో బాలాజీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు జీఎస్‌టి ఏ వస్తువులపై తగ్గిందో ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ అధికారులు హేమంత్, రవీంద్ర, సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి లత పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పేదలకు కార్పొరేట్ వైద్య నిపుణుల ద్వారా ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించామని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. శనివారం చిత్తూరు పట్టణం పివికెఎన్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని చిత్తూరు ఎంపి ప్రసాదరావు కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. శిబిరంలో రెయిన్ బో, ఐ ఫౌండేషన్, అరవింద్ ఐ ఆసుపత్రుల లాంటి కార్పొరేట్ ఆస్పత్రులకు చెందిన వైద్యులు ద్వారా వైద్యం అందించడంతో పాటు మందులు, కళ్ళ అద్దాలు ఉచితంగా అందిస్తున్నామని ఎంపీ తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ బెంగుళూరు, హైదరాబాదు వంటి నగరాల నుండి వచ్చిన వైద్య నిపుణులు ఈ శిబిరంలో వైద్యం అంది స్తున్నారన్నారు. వివిధ వైద్య పరీక్షల అనంతరం ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, నగర మేయర్ ఆముద, చూడా చైర్మన్ కటారి హేమలత, నగర డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఆర్డీవో శ్రీనివాసులు, డిఆర్డిఏ పిడి శ్రీదేవి, జడ్పీసీఈవో రవికుమార్ పాల్గొన్నారు.



ప్రాంగణ ఎంపికలో ఎంపికైన విజయం విద్యార్థులు

గ్లో లాజిక్ కంపెనీకి విజయం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రముఖ గ్లో లాజిక్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో విజయం సైన్స్ అండ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 29 మంది ఎంపికైనట్లు విజయం సంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 42 లక్షల రూపాయల వార్షిక వేతనం అందుతుందన్నారు. ప్రాంగణం ఎంపికలో బీకాం , బిబిఏ తృతీయ సంవత్సరం విద్యార్థులు ఎంపిక కావడం పట్ల విజయం విద్యా సంస్థలు అకాడమిక్ డైరెక్టర్ శైలజ మూర్తి ఆనందం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత, అధ్యాపకులు అభినందించారు.

పెద్దిరెడ్డికి పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన పురస్కరించుకొని శనివారం చిత్తూరు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయానంద రెడ్డి నేతృత్వంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వైసిపి కార్యాలయం, స్థానిక సంతపేటలో జ్ఞాన జగదీష్ ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేశారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రసూతి విభాగం లోని బాలింతలకు బేబీ కిడ్స్ కార్పొరేటర్ హరివి రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నీవా నది బాధితులకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చూడ మాజీ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మహిళా నాయకురాలు గాయత్రీ దేవి, అంజలి పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం వైసిపి కార్యాలయంలో బుధవారం గంగవరం వైసిపి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పెద్దిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలం లోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట దీపికా కళ్యాణ మండపం వద్ద వైసిపి మండల అధ్యక్షులు మణి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 75వ జన్మదిన వేడుకలను ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు గురవారెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, సర్పంచులు రాజశేఖర్ రెడ్డి, విజయ ఏకాంబరం, నాయకులు జనార్దన్, యేసు రత్నం, కాలప్ప, అశోక్ రెడ్డి, కోటిరెడ్డి, బాబు ,శ్యామ్, సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుంగనూరు: పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను పుంగనూరు పట్టణంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రైవేటు బస్టాండ్ లో మున్సిపల్ చైర్మన్ అలీం బాషా ఆధ్వర్యంలో, గోకుల్ సర్కిల్ సిద్ధిక్ బాష, అంబేద్కర్ సర్కిల్లో ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, అనీషా రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటగడ్డ అమర్నాథ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, అమ్ము, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కార్వేటినగరం : పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా కార్వేటి నగరం లోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఎంపీపీ లతబాలాజీ ఆదేశాల మేరకు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన తనయుడు మిథున్ రెడ్డి క్షేమంగా ఉండాలని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. రానున్న ఎన్నికలలో మళ్లీ వైసీపీ ప్రభుత్వాన్ని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గెలిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ , లోకనాథంనాయుడు, ఆలయ అధ్యక్షులు సురేష్ కుమార్,ఆకుల గోపి, పురుషోత్తం రాజు, శేషాద్రి, శివ ప్రకాష్ మొదలి, సాయి రాయల్, హరి భక్తులు పలువురు పాల్గొన్నారు.



కార్వేటినగరంలో



బైరెడ్డిపల్లిలో

బైరెడ్డిపల్లి: పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం వేడుకలు నాయకులు, కార్యకర్తలు బైరెడ్డిపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. బైరెడ్డిపల్లి పట్టణం లోని వైసిపి క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో కేక్ కటింగ్, అన్నదానం నిర్వహిస్తూ పెద్దిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. మొగసాల బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి , రాష్ట్ర ఎంపీపీ సంఘం అధ్యక్షుడు, బైరెడ్డిపల్లి మండలం ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్ దయానంద గౌడ్ , బైరెడ్డిపల్లి మండలం జెడ్‌పిటిసి, వైసిపి మండల అధ్యక్షుడు కేశవులు, వైస్ ఎంపీపీ లు, సర్పంచులు, సీనియర్ వైసిపి నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -వికోట : మండల కేంద్రమైన వికోటలో కళావతి, దశరథ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష, ఉచిత కంటి అద్దాల పంపిణీకి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. అమ్మాక్స్ సహకారంతో స్థానిక గ్రీన్ సిటీ లోని అమ్మాక్స్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దశరథ రెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా దశరథ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థలో విధులు నిర్వహించే సిబ్బంది చొరవతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి పేదలకు వైద్య శిబిరం ద్వారా సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మొట్టమొదట పేదలకు వైద్య శిబిరం ద్వారా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కంటి పరీక్ష శిబిరంలో 210 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో కాట్రాక్ట్ సర్జరీకి ఎంపిక అయిన వారిని అందుబాటులోని హాస్పిటల్లో అనుసంధానం చేయడం ద్వారా సర్జరీ చేయిస్తామని తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో కార్యక్ర మాలు ట్రస్ట్ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.



ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గ్రామ సమస్యలపై సమావేశం

ప్రజాశక్తి-తవణంపల్లి: గ్రామ సమస్యల పరిష్కారంపై క్లస్టర్ల సమావేశం శనివారం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి ఏ గొల్లపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో రామనాథపురం లోని సుధాకర్ నాయుడు ఇంటి వద్ద మాధవరం, ఎం బోయపల్లి, మల్లకుంట, కృష్ణాపురం గ్రామాలకు చెందిన పెద్దలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, యూనిట్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లతో స్నేహపూర్వక సమావేశం నిర్వహించారు. గ్రామ స్థాయిలో ఉన్న పలు సమస్యల పై ప్రధానంగా పల్లి గ్రామంలో స్కూల్ లోకి వర్షపు నీరు చేరి పిల్లలు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తుల ద్వారా తెలుసుకొని తగు చర్యలు తీసుకోవడానికి అధికారులకు తెలుపుతామన్నారు. జిఎస్టిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కార్యకర్తలకు సూచనలు చేశారు. తవణంపల్లి మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి కార్యకర్తలకు నాయకులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్క వింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించే దిశగా లేదంటే తమ దృష్టికి తీసుకొని రావాలని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలి దిలీప్, క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రవీణ్ నాయుడు, కో క్లస్టర్ కంప్యూటర్ శివ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఏఐసీసీ సెక్రటరీని కలిసిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-కుప్పం: చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏఐసీసీ సెక్రెటరీ గణేష్ కుమార్ యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ మస్తాన్‌వలీని కుప్పం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు శనివారం కలిశారు. కుప్పం నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను ఏఐసీసీ సెక్రటరీకి వివరించినట్లు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆవుల గోపి, నాలుగు మండలాల అధ్యక్షులు మునుస్వామి, సీనప్ప, సుబ్రహ్మణ్యం, రోహినప్ప, నిజాముద్దీన్, ఇర్ఫాన్ తె లిపారు.



ఏఐసీసీ సెక్రటరీని కలిసిన కుప్పం కాంగ్రెస్ నాయకులు